సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం। 1 । ఫిబ్రవరి। 2025



ఐక్యతతోనే సంస్కృతికి రక్షణ

గిరిజన సంస్కృతిని కాపాడుకునేలా ఐక్యంగా ఉండాలని తెల్లం పరివార్ సంఘటన్ మిలాన్ సమార్ పేర్కొంది. 8లో



భూమి పోయినా..

సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంలో భూమి కోల్పోయిన 241 మంది గిరిజన రైతులకు పరిహారం అందలేదు. 8లో

గరిష్టం / కనిష్టం 34°/ 18°

వాతావరణం

జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉదయాన్నే మంచు, రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు గేట్‌-2025

సుజాతనగర్‌: నేడు, రేపు నిర్వహించనున్న గేట్‌ -2025 పరీక్షలకు అబ్దుల్‌ కలాం ఇంజనీరింగ్‌ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మొదటి సెషన్‌, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సెషన్‌ పరీక్షలు నిర్వహించనున్నారు. శనివారం రెండు సెషన్లలో కలిపి 207 మంది, ఆదివారం 233 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందే నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించనున్నారు. అభ్యర్థులు డౌన్‌లోడ్‌ చేసుకున్న అడ్మిట్‌ కార్డుతో పాటు ఏదైనా ఒరిజనల్‌ గుర్తింపు కార్డు తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు.

జాతీయస్థాయిలో ఉపాధ్యాయుడి ప్రతిభ



వీవీ కోటేశ్వరరావు

మణుగూరు రూరల్‌: మినిస్ట్రీ ఆఫ్‌ ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ ఇన్‌ఫర్మేషన్‌ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సైబర్‌ సెక్యూరిటీ పోటీల్లో మండలంలోని రామానుజవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వీవీ కోటేశ్వరరావు సైబర్‌ అవేర్‌నెస్‌ టైల్స్‌ విభాగంలో ప్రతిభ కనబర్చారు. రాష్ట్రం నుంచి ప్రథమ బహుమతికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని ఎంఈఓ స్వర్ణజ్యోతి, కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయులు జి.నాగశ్రీ, ఎం.శ్రీలత, పి.యశోద తదితరులు అభినందించారు.

భారజల కర్మాగారం జీఎంగా హెచ్‌కే శర్మ



హెచ్‌.కే.శర్మ

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం జీఎంగా హరీష్‌కుమార్‌ శర్మకు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం భారజల బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత జీఎం జగ్గారావు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో డీజీఎంగా పని చేస్తున్న హెచ్‌కే.శర్మకు జీఎంగా బాధ్యతలు అప్పగించారు. నేడు ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.


దక్షిణ భారతస్థాయిలో విద్యార్థి ప్రతిభ



పాండిచ్చేరిలో బహుమతి అందుకుంటున్న సంతోష్‌కుమార్‌

సింగరేణి(కొత్తగూడెం): దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఇల్లెందులో సింగరేణి పాఠశాల విద్యార్థి సంతోష్‌ కుమార్‌ రాణించాడని సంస్థ ఎడ్యుకేషన్‌ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్‌ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. సంతోష్‌కుమార్‌ రూపొందించిన స్మార్ట్‌ రెగ్యులేటరీ ప్రాజెక్ట్‌ జిల్లాస్థాయిలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి దక్షిణ భారతస్థాయికి ఎంపికైందన్నారు. గత నెల 21 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో వ్యక్తిగత కేటగిరీలో మొదటి బహుమతి దక్కించుకుందని వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఇంట్లో వినియోగించే గ్యాస్‌ సిలిండర్‌ లీకైన మూడు సెకన్లలో ఆటోమేటిక్‌గా లీకేజీని ఆపివేసేలా ఈ ప్రాజెక్ట్‌ రూపొందించారని, దీనివల్ల గ్యాస్‌ లీకేజీ ప్రమాదాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థితోపాటు గైడ్‌ టీచర్‌ ధనలక్ష్మిని సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్‌ తదితరులు అభినందించారు.

కేటీపీఎస్‌ 7వ దశ ఇన్‌చార్జి సీఈగా శ్రీనివాసబాబు



శ్రీనివాసబాబు

పాల్వంచ: కేటీపీఎస్‌ 7వ దశ చీఫ్‌ ఇంజనీర్‌ పి.వెంకటేశ్వర్లు శుక్రవారం పదవీ విరమణ పొందారు. దీంతో జెన్‌కో ట్రైనింగ్‌ సెంటర్‌ సీఈ శ్రీనివాస బాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా కేటీపీఎస్‌లో ఏఈగా ప్రస్థానం ప్రారంభించిన వెంకటేశ్వరరావు అంచెలంచెలుగా ఎదిగి సీఈ స్థాయికి చేరుకున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు సీఈగా విధులు నిర్వర్తించారు. కాగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేటీపీఎస్‌ 7వ దశ సీఈ పోస్టు కోసం ప్రస్తుతం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన శ్రీనివాసబాబుతోపాటు నాగార్జున సాగర్‌ సీఈ మంగేష్‌ కుమార్‌, కేటీపీఎస్‌ 5,6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌ రావు సైతం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఫలితాలు మెరుగయ్యేనా?

ఐటీడీఏ పరిధిలో గురుకులాలను మినహాయిస్తే ఇతర పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు రావడంలేదు. ఏటా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించామని చెబుతున్నా ఫలితాల సాధనలో మాత్రం వెనుకబడిపోతున్నారు. ఐటీడీఏ పరిధిలో గిరిజన కళాశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ట్రైబల్‌ వెల్ఫేర్‌ హాస్టళ్లు, గురుకులాలు, బెస్ట్‌ అవైలబుల్‌ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్‌ మీడియట్‌ వార్షిక పరీక్ష ఫలితాలు ఆశాజనకంగా వస్తున్నాయి. ఇతర పాఠశాలల్లో మాత్రం క్రమంగా మెరిట్‌ శాతం తగ్గుతోంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు సుమారు 50 రోజుల సమయమే ఉంది. ఇప్పుడైనా గిరిజన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. –భద్రాచలం



స్టడీ అవర్‌లో విద్యార్థినులు

గణితం, ఆంగ్లం, సైన్స్‌ సబ్జెక్ట్‌ల్లో విద్యార్థుల వెనుకంజ

ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఐటీడీఏలో ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశాలు నిర్వహించి పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలను సాధించాలని ఆదేశిస్తున్నారు. కానీ ఆచరణలో మాత్రం సాధించలేకపోతున్నారు. 2022–23లో ఆశ్రమ పాఠశాలల్లో 77 శాతం ఉత్తీర్ణతే నమోదైంది. కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో 50 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత వచ్చింది. 2023–24లో సైతం వంద శాతం ఫలితాలు నమోదు కాలేదు. ప్రధానంగా గణితం, ఆంగ్లం, సైన్స్‌ సబ్జెక్టలలో విద్యార్థులు ఎక్కువ మంది ఫెయిల్‌ అవుతున్నారు. తక్కువ ఫలితాలు నమోదైన పాఠశాలల హెచ్‌ఎంలకు, సబ్జెక్ట్‌ ఉపాధ్యాయులకు పీఓ షోకాజ్‌ నోటీసులను జారీ చేయటం కూడా పరిపాటిగా మారింది.

ఏటా ఐటీడీఏ పాఠశాలల్లో నిరాశపరుస్తున్న రిజల్ట్స్‌

- ఈసారి గిరిజన విద్యార్థులపై పీఓ ప్రత్యేక దృష్టి
- పదో తరగతి ఫలితాల మెరుగునకు 100 రోజుల ప్రణాళిక

పీఓ కృషి ఫలించేనా!

ఐటీడీఏ పీఓగా రాహుల్‌ బాధ్యతలు స్వీకరించిన అనంతరం గిరిజన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేశారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ప్రత్యేకంగా 'ఉద్దీపనం' పేరిట ప్రత్యేక మెటీరియల్‌ అందించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు వంద రోజుల ప్రణాళిక రూపొందించి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పక్కాగా అమలు చేయిస్తున్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలకు రిసోర్స్‌ పర్సన్‌ నియమించి ప్రత్యేక విధులను కేటాయించారు. ఈ నేపథ్యంలో ఈసారైనా మెరుగైన ఫలితాలు వస్తాయని పలువురు ఆశిస్తున్నారు.

ఏజెన్సీ డీఈఓ పోస్టు భర్తీ చేయరూ..

ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకులాలకు ఆర్‌సీఓ, ఆశ్రమ పాఠశాలలకు డీడీలు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఇతర బాధ్యతలు కూడా ఉండటంతో పాఠశాలలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారు. గతంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఏజెన్సీ డీఈఓ పోస్టు ఉండేది. 2016లో జిల్లాల పునర్విభజనలో భాగంగా భద్రాచలం ఏజెన్సీ డీఈఓ పోస్టును జిల్లా డీఈఓ పోస్టుగా అప్‌గ్రేడ్‌ చేశారు. 2016లో చివరిగా ఇన్‌చార్జి ఏజెన్సీ డీఈఓగా రవీందర్‌ బాబు బాధ్యతలను నిర్వర్తించారు. ఆ తర్వాత ఏజెన్సీ డీఈఓ పోస్టు మళ్లీ భర్తీ చేయలేదు. గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, బెస్ట్‌ అవైలబుల్‌ పాఠశాలలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించే అధికారి లేకపోవడంతో ఫలితాలపై ప్రభావం పడుతోందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యలపై దృష్టి సారించాలని, మిగిలిన ఉన్న 50 రోజుల్లో పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమష్టిగా కృషి చేస్తున్నాం



పదో తరగతి, ఇంటర్‌ ఫలితాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. సబ్జెక్టలలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రధానోపాధ్యాయులకు, సబ్జెక్ట్‌ ఉపాధ్యాయులకు మార్గదర్శకాలను విడుదల చేశాం. సమష్టి కృషితో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

–మణెమ్మ, డీడీ, ఐటీడీఏ భద్రాచలం

క్రమశిక్షణ కలిగి ఉండాలి

- ఎస్పీ రోహిత్‌రాజు
- ముగిసిన సాయుధ బలగాల డీ మొబిలైజేషన్‌ పరేడ్‌



పోలీసు అధికారికి మెడల్‌ అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్‌: పోలీస్‌ శాఖలో ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణ కలిగి ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. కొత్తగూడెం హేమచంద్రాపురంలోని పోలీసు హెడ్‌ క్వార్టర్స్‌లో 15 రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా ఆర్మ్‌డ్‌ రిజర్వ్‌ సిబ్బంది మొబిలైజేషన్‌ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. 5 ప్లాటూన్లతో ఏర్పాటు చేసిన పరేడ్‌కు అడ్మిన్‌ ఆర్‌ఐ లాల్‌ బాబు కమాండర్‌గా వ్యవహరించారు. సిబ్బంది ఇన్‌ డోర్‌, ఔట్‌డోర్‌, ఫైరింగ్‌ ప్రాక్టీస్‌లలో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు వేడుకలకు హాజరైన ఎస్పీ ఆర్మ్‌డ్‌ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. మొబిలైజేషన్‌ కార్యక్రమం ద్వారా శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం కూడా లభిస్తుందని అన్నారు. అనంతరం పోలీస్‌ శాఖలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 260 అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పతకాలను అందజేశారు. కఠిన సేవ, ఉత్తమ సేవ, సేవా పతకాలతో పాటు యాంత్రిక్‌ సురక్షా సేవా పతకాలను పరేడ్‌ మైదానంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్బీ సీఐలు నాగరాజు, శ్రీనివాస్‌, అడ్మిన్‌ ఆర్‌ఐ లాల్‌బాబు, హోంగార్డ్‌ ఆర్‌ఐ నరసింహారావు, ఎంటీఓ సుధాకర్‌, వెల్ఫేర్‌ ఆర్‌ఐ కృష్ణారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా హెల్త్‌ క్యాంపులతో ఆరోగ్యం



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

దుమ్ముగూడెం : మెగా హెల్త్‌ క్యాంపులు ఆరోగ్యానికి దోహదం చేస్తాయని ఐటీడీఏ ప్రాజెక్ట్‌ అధికారి బి.రాహుల్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరారం ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్‌ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే గిరిజనుల కోసం హెల్త్‌ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి, చిన్నపిల్లలు, చర్మ వ్యాధి, చెవి, గొంతు వైద్య నిపుణులతో సేవలందించినట్లు తెలిపారు. గర్భిణులకు స్కానింగ్‌ సౌకర్యం కూడా కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కర్‌, అధికారులు బాలాజీ, చైతన్య, పుల్లారెడ్డి, రేణుక రెడ్డి, నాగరాజు, సచిన్‌, మౌనిక, వెంకన్న, వాణి, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు చేయాలి

భద్రాచలం : సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్‌ సూచించారు. శుక్రవారం తన చాంబర్‌లో అధికారులతో మాట్లాడారు. కరకగూడెం మండలం చిరుమల్లలో జరిగే జాతరకు ఏర్పాటు చేయాలని అక్కడి ఆదివాసీలు కోరారని తెలిపారు. విద్యుత్‌, శానిటేషన్‌, తాగునీటి సౌకర్యం, టెంట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, షవర్‌ బాత్‌లు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్‌ నాగప్రసాద్‌, ఎంపీడీవో దేవర ప్రసాద్‌, విద్యుత్‌ శాఖ ఏడీ వేణు, డీఈ మధుకర్‌, ఏఈ యోగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాగ్గేయకారోత్సవాలు

- ఐదు రోజులపాటు అలరించనున్న కళాకారులు
- భక్త రామదాసు జయంతి ఉత్సవాలకు ముస్తాబు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: ప్రముఖ వాగ్గేయకారుడు, శ్రీ సీతారామ చంద్రస్వామివారి అపరభక్తుడు, భద్రాచలం దేవస్థానం నిర్మాణ కర్త భక్త రామదాసుగా పేరుగాంచిన కంచర్ల గోపన్న జయంతి ఉత్సవాలకు భద్రాచలం ముస్తాబైంది. రామదాసు జయంతి సందర్భంగా ఏటా శ్రీ నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్‌ ట్రస్టు, దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు వాగ్గేయకారోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు రాష్ట్రాల సంగీత కళాకారులు, వాయిద్య కళాకారులు ప్రదర్శనలతో ఆకట్టుకుంటారు. ఈ ఏడాది 392వ జయంతి సందర్భంగా శనివారం నుంచి 5వ తేదీ వరకు జరిగే వేడుకలకు ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపం వేదిక కానుంది. భక్త రామదాసు కీర్తనలతో పాటు సంగీత కార్యక్రమాలతో భద్రగిరి స్వరరాగ ఝరిలో ఓలలాడనుంది. శనివారం ఉదయం 9 గంటలకు నగర సంకీర్తన, రామదాసు విగ్రహానికి అభిషేకంతో వాగ్గేయకారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం చిత్రకూట మండపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద రామదాసు నవరత్న కీర్తనల గోష్ఠిగానం, అనంతరం సంగీత కళాకారుల ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

స్వర్ణకవచధారణలో దర్శనమిచ్చిన రామయ్య

దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్య సేవలపై కేంద్ర బృందం ఆరా



ఆరోగ్య సేవలపై ఆరా తీస్తున్న పాపులేషన్‌ రీసెర్చ్‌ సెంటర్‌ కమిటీ సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై పాపులేషన్‌ రీసెర్చ్‌ సెంటర్‌ కమిటీ సభ్యులు ఆరా తీశారు. శుక్రవారం రామవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి కల్పించాల్సిన వసతులపై ఆరా తీశారు. జాతీయ, మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలు, అసంక్రమణ వ్యాధుల నివారణ, ఎమర్జెన్సీ మందుల నిర్వహణ, లేబోరేటరీ నిర్వహణ, గర్భిణులకు ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాల నిర్వహణపై సమాచారం సేకరించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి. ఆర్‌ రాము, పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్‌ రాకేష్‌, నర్సింగ్‌ ఆఫీసర్‌ శంకరమ్మ, పబ్లిక్‌ హెల్త్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌, దిలీప్‌ సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కరకగూడెం: మండలంలోని చిరుమల్ల గ్రామంలో రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క –సారలమ్మ జాతరకు రావాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అధ్యక్షుడు చందా భిక్షపతి, సలహాదారుడు చుంచు రామకృష్ణ తదితరులు హైదరాబాద్‌లో గవర్నర్‌ను కలిసి శాలువతో సత్కరించారు. జ్ఞాపిక అందించారు. వీలు చూసుకుని సందర్శనకు వస్తానని హామీ ఇచ్చారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి స్నాక్స్‌

- పదో తరగతి విద్యార్థులకు అందించనున్న ప్రభుత్వం
- జిల్లాకు రూ.17.78 లక్షలు విడుదల
- ప్రభుత్వ పాఠశాలల్లోని 3,730 మంది విద్యార్థులకు లబ్ధి



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు (ఫైల్‌)

కొత్తగూడెంఅర్బన్‌: ఎట్టకేలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్నాక్స్‌ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో స్నాక్స్‌ అందించనున్నారు. విద్యార్థులకు గత డిసెంబర్‌ నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులపై ఒత్తిడి పెరిగి అలసిపోతున్నారు. స్నాక్స్‌ వంటివి ఇస్తే నీరస పడకుండా చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది. గతంలో ప్రభుత్వం స్నాక్స్‌ అందించేందుకు నిధులు విడుదల చేసేది. కానీ రెండేళ్లుగా నిధులు ఇవ్వకపోడంతో స్నాక్స్‌ అందడంలేదు. స్వచ్ఛంద సంస్థలు, సామాజికవేత్తలు, దాతల సహకారంతో కొన్ని పాఠశాలల విద్యార్థులకు స్నాక్స్‌ అందిస్తున్నారు. బిస్కెట్‌ వంటివి ఇస్తున్నారు. దాతలు సహకారం అందని అనేక పాఠశాలల్లో విద్యార్థులు సాయంత్రం వేళ ప్రత్యేక తరగతుల్లో నీరసపడిపోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం జిల్లాకు స్నాక్స్‌ కోసం 38 రోజులకు రూ. 17.78 లక్షలు కేటాయించింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 3,730 మంది..

జిల్లాలోని 110 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 3,730 మంది పదో తరగతి విద్యార్థులకు శనివారం నుంచి స్నాక్స్‌ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.15 విలువైన స్నాక్స్‌ను ఈ నెల 1వ తేదీ నుంచి మార్చి 20వ తేదీ వరకు అందించనున్నారు. స్నాక్స్‌ను అందించే బాధ్యత మిడ్డే మిల్స్‌ వర్కర్లకు అప్పగించారు. దీంతో వారు వివిధ రకాల స్నాక్స్‌ వండి వడ్డించే ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా మార్చి 21 నుంచి ఏప్రిల్‌ 4వ తేదీ వరకు పబ్లిక్‌ పరీక్షలు నిర్వహించనున్నారు.

ఏమేమి ఇస్తారంటే..

విద్యార్థులకు మిల్లెట్స్‌, బిస్కెట్లు, ఉల్లి పకోడి , శనగలు, పల్లీబెల్లం, బొబ్బర్లు, ఉడికించిన పెసళ్ల వంటివి స్నాక్స్‌గా అందించనున్నారు. పరీక్షలు ప్రారంభమయ్యేవరకు విద్యార్థులకు క్రమం తప్పకుండా అందించాలని డీఈఓ ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. స్నాక్స్‌లో కొత్త మెనూతో విద్యార్థులకు పౌష్టికాహారం అందే అవకాశం ఉంటుంది.

నేటి నుంచి పంపిణీ



జిల్లాలోని 110 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3,730 మంది విద్యార్థులకు నేటి నుంచి స్నాక్స్‌ అందిస్తాం. ఇందు కోసం హెచ్‌ఎంలు, మధ్యాహ్న భోజన వర్కర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. స్నాక్స్‌తో విద్యార్థులు ప్రత్యేక తరగతుల్లో చురుకుగా ఉండే అవకాశం ఉంది.

–ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

సోలార్‌ విద్యుదుత్పత్తికి ముందుకు రావాలి

విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ మహేందర్‌

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): బంజరు భూములు, వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల్లో సౌర విద్యుత్‌ ఉత్పత్తికి రైతులు ముందుకు రావాలని విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ జి.మహేందర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 500 కిలోవాట్ల నుంచి 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్‌ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, రైతు సమూహాలు, నీటి వినియోగదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమాఖ్యలు, డెవలర్స్‌ దరఖాస్తు చేసుకోవచ్చని, 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు సమీపంలో భూములు ఉంటే లైన్‌ఖర్చులు కూడా తక్కువ అవుతాయని వివరించారు. ఎన్‌పీడీసీఎల్‌ టారిఫ్‌ ప్రకారం విద్యుత్‌ను కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు www. tgredco. telangana. gov. in వెబ్‌సైట్‌లో లాగిన్‌ కావాలని కోరారు. దరఖాస్తు గడువు ఈ నెల 22వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు టీజీ రెడ్కో డీజీఎం 63049 03933, జీఎం 90005 50974 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మళ్లీ టీఎన్‌టీయూసీదే గెలుపు

ఐటీసీలో 60 ఓట్ల మెజారిటీతో విజయం



విజయకేతనం చూపుతున్న టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు హరిప్రసాద్‌

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో మళ్లీ టీఎన్‌టీయూసీనే విజయం సాధించింది. గత ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీఎన్‌టీయూసీ రెండోసారి కూడా విజయ ఢంకా మోగించింది. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 1253 ఓట్లకు గాను 1252 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌ నిర్వహించారు. సాయంత్రం 5గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. రాత్రి 7.30 గంటలకు ఎన్నికల ఫలితాలను కార్మికశాఖ అధికారులు వెల్లడించారు. టీఎన్‌టీయూసీ 480 ఓట్లు సాధించి 60 ఓట్ల మెజారిటీతో గెలిచింది. హోరాహోరీగా తలపడిన ఐఎన్‌టీయూసీ 420 ఓట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. బీఆర్‌టీయూ 310 ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది. బీఎంఎస్‌ 21 ఓట్లు, టీఈయూ 18 ఓట్లు పొందాయి. మూడు ఓట్లు చెల్లలేదు. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూలు రెండు నెలలుగా ప్రచారం హోరెత్తించాయి. అన్ని ట్రేడ్‌ యూనియన్లు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేశాయి.

డీఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు

పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్‌ ఆధ్వర్యంలో పలువురు సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్‌ సిబ్బంది ఎన్నికల బందోబస్తు నిర్వహించారు. కార్మికశాఖ అధికారులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించారు. విజయం సాధించిన టీఎన్‌టీయూసీ మిత్రపక్షాలు శుక్రవారం రాత్రి విజయోత్సవ ర్యాలీ నిర్వహించాయి. రంగులు చల్లుకుని టపాసులు కాలుస్తూ విజయోత్సవాన్ని జరుపుకున్నాయి. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్‌ను పలువురు నాయకులు, కార్మికులు అభినందనలతో ముంచెత్తారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, రత్నాకర్‌, గల్లా నాగభూషయ్య, గాదె రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు వేదిక



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీదేవి

ఇల్లెందురూరల్: విద్యార్థులు విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగేందుకు వైఎఫ్ఎస్ఐ వేదికగా ఉంటుందని కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. యూత్ ఫర్ సోషల్ 21వ శతాబ్దపు నైపుణ్యాలకు ఇంపాక్ట్ అనే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వైఎఫ్ఎస్ఐపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 21వ శతాబ్దపు నైపుణ్యాలతో విద్యార్థులను ఓ వ్యాపారంలో భాగస్వామ్యం చేసి, ఫలితాలను విశ్లేషించడమే యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తోడేటి రాజు, కృష్ణవేణి, జి.శేఖర్, సరిత, ఈశ్వర్, డాక్టర్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమత్‌శాస్త్రి సేవలు అభినందనీయం



హనుమత్‌శాస్త్రి కుటుంబ సభ్యులతో ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పండితులు హనుమత్‌శాస్త్రి సేవలు అభినందనీయమని ఈఓ ఎల్.రమాదేవి అన్నారు. దేవస్థానం ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమానికి ఈవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం హనుమత్‌శాస్త్రి దంపతులకు వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందించగా, ఈఓ రమాదేవి ఘనంగా సత్కరించి స్వామివారి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వైదిక పరిపాలన ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు

మణుగూరుటౌన్: విధుల్లో నిర్లక్ష్యం, విద్యార్థులను క్యాటరింగ్‌కి పంపడం, మెనూ ప్రకారం భోజనం అందించకపోవడం, హాస్టల్ పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడం, కింది స్థాయి ఉద్యోగులతో తరచూ వివాదాలు, ఉన్నతాధికారుల పేర్లు చెప్పి లంచాలు డిమాండ్ చేయడం వంటి చర్యలపై పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోని ఎస్సీ బాలుర వార్డెన్ శ్రీనివాస్‌ను గురువారం ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఏఎస్‌డబ్ల్యూఓ హనుమంతరావు వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పలు ఆరోపణల నేపథ్యంలో షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ సమాధానం చెప్పకుండా.. మరో వార్డెన్‌కి బాధ్యతలు అప్పగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని, సెలవులో ఉన్నానంటూ అధికారులనే తప్పుదోవ పట్టించే విధంగా ప్రవర్తించాడని చెప్పారు. ఆయన స్థానంలో రాంబాబును ఇన్‌చార్జ్‌గా నియమించామని వివరించారు.

పాము కలకలం



పామును తీసుకెళ్తున్న ప్రదీప్

అశ్వారావుపేటరూరల్: మిషన్ భగీరథ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌లోకి శుక్రవారం పాము రావడంతో ఉద్యోగులు, సిబ్బంది భయందోళనకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేటలోని మిషన్ భగీరథ ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ కార్యాలయాన్ని తెరిచేందుకు తలుపు తీయగా, అప్పటికే లోపల ఉన్న పామును చూసి సిబ్బంది, ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. కాగా, పాము కార్యాలయం లోపల ఉన్న మెట్ల కిందకు వెళ్లడంతో డీఈఈ ఎస్‌డీ సలీం స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఏపీలోని ఏలూరు జిల్లా మక్కినవారిగూడేనికి చెందిన స్నేక్ టేకర్ ప్రదీప్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన కార్యాలయానికి చేరుకొని మెట్ల కింద ఉన్న జెర్రిగొడ్డు పామును పట్టుకుని, అటవీ ప్రాంతంలో వదిలేశారు.

బీఈడీ పరీక్షల్లో కాపీయింగ్

సత్తుపల్లి: బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈమేరకు సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో శుక్రవారం ఒకరి పరీక్ష ఇంకొకరు రాస్తూ పట్టుబడ్డారు. పరీక్షకు కనపర్తి సాయికుమార్ హాల్ టికెట్‌పై గుడిపూడు శ్రీనివాసరావు ఫొటో అంటించుకుని హాజరయ్యారు. ఈ విషయాన్ని ఇన్విజిలేటర్ గుర్తించగా కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

భూమి పోయినా దక్కని ఫలితం

పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

- సీతారామ లింక్ కెనాల్ నిర్మాణానికి 170 ఎకరాల భూసేకరణ
- ఆరు నెలలుగా పరిహారంపై దాటవేస్తున్న యంత్రాంగం



లింక్ కెనాల్ పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు (ఫైల్)

ఏన్కూరు: నోటీసులు ఇవ్వకుండానే భూములు తీసుకున్నారు.. పనులు వేగంగా చేపడుతున్నారు.. దీంతో తమ పరిహారం మాటేమిటని రైతులు ఆందోళన చేసిన ప్రతీసారి ప్రజాప్రతినిధులు నచ్చజెప్పి దాటవేయడం ఆనవాయితీగా మారింది. చివరకు వైరాలో జరిగే సభలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షాన పరిహారం చెక్కులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదంతా జరిగి ఆరు నెలలు గడిచినా పరిహారం అందకపోవడంతో సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంలో భాగంగా రెండు మండలాల్లో భూమి కోల్పోయిన 241 మంది గిరిజన రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

241 మంది.. 170 ఎకరాలు

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్‌కు చేర్చేలా లింక్ కెనాల్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్ 18వ టన్నెల్ నుంచి ఏన్కూరు మండలం హిమామ్‌నగర్, రేపల్లెవాడ మీదుగా ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్ వరకు సీతారామ లింక్ కెనాల్ పనులు చేపట్టారు. 80 మీటర్ల వెడల్పుతో తవ్వే ఈ కాల్వ కోసం రెండు మండలాల్లో 241 మంది రైతులకు చెందిన సుమారు 170 ఎకరాల భూమి అవసరమైంది. ఇప్పటికే జూలూరుపాడు మండలం వినోభానగర్ నుంచి హిమామ్‌నగర్ వరకు 30 ఎకరాల్లో లింక్ కెనాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో 36 మంది రైతులు భూములు కోల్పోయారు. రైతులు ఆయిల్‌పామ్, మామిడి తోటలతో పాటు కరివేపాకు వంటి దీర్ఘకాల పంటలను నష్టపోయారు. అంతేకాక పొలాల్లో బోర్లు, బావులు సైతం కనుమరుగయ్యాయి. దాదాపు ఈ పొలాలన్నీ రహదారి పక్కనే ఉండటంతో బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.కోటి పైగానే ధర పలుకుతోంది. ఈ భూములకు ప్రభుత్వం ఇచ్చే అరకొర పరిహారం కూడా నెలల తరబడి పెండింగ్ పెట్టడంతో ఆవేదన చెందుతున్నారు.

మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా..



ఏన్కూరు సమీపాన తవ్వకం పూర్తయిన లింక్ కెనాల్

ఏన్కూరు మండలంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు పరిశీలించారు. దీంతో రైతులు కాల్వ పనుల వద్ద ఆందోళన చేపట్టడమే కాక మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత వైరాలో జరిగిన సీఎం హాజరైన సభలో పరిహారం మాటెత్తలేదు. దీంతో ఆరు నెలలుగా నిరీక్షిస్తున్న రైతులు జనవరి 20న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను కలవగా ఎకరాకు రూ.21 లక్షల చొప్పున పరిహారం వస్తుందని చెప్పడంతో సంతోషించారు. ఈ మేరకు ఏన్కూరు, జూలూరుపాడు మండలాల భూనిర్వాసితులు పరిహారం కోసం భూమి పత్రాలు, బ్యాంకు అకౌంట్ల వివరాలను రెవెన్యూ అధికారులకు అందించారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరిహారం జమ అవుతుందని భావించినా మరోమారు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

రెండు ఎకరాల భూమి కోల్పోయా..



లింక్ కెనాల్ నిర్మాణంలో రోడ్డు పక్కనే ఉన్న రెండెకరాల భూమి కోల్పోయా. ఇప్పటి వరకు పరిహారం అందకపోగా రెండు పంటలు కోల్పోయాను. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షాన పరిహారం ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చినా అందలేదు. ఎకరానికి రూ.30 లక్షలు అడుగుతుంటే రూ.20 లక్షలని చెబుతూ అదీ ఇవ్వడం లేదు.

–ఆది నర్సింహారావు, రైతు, ఏన్కూరు

గిరిజన రైతులు నష్టపోతున్నారు..



సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంతో గిరిజన రైతులు విలువైన భూములు కోల్పోయారు. ఆందోళనలు చేసి పనులు ఆపినప్పుడల్లా ప్రజాప్రతినిధులు నచ్చజెప్పి ఆగస్టులో పరిహారం ఇస్తామన్నా నేటికీ హామీ నెరవేరలేదు. భూములతో పాటు పంటలు కోల్పోయిన రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలి.

–బానోతు బాలాజీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

90 శాతం రైతులు పత్రాలు ఇచ్చారు



మండలంలోని హిమామ్‌నగర్ నుంచి ఏన్కూరు వరకు 140 ఎకరాల్లో లింక్ కెనాల్ పనులు జరిగాయి. 205 మంది రైతులకు పరిహారం ఇవ్వాలి. ఇందుకోసం 90 శాతం మంది రైతులు భూమి, బ్యాంకు అకౌంట్ల పత్రాలు ఇచ్చారు. మిగతా వారు వారసత్వ వివాదంతో ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి త్వరలోనే పరిహారం అందుతుంది.

–సీహెచ్ శేషగిరిరావు, తహసీల్దార్, ఏన్కూరు

తల్లిదండ్రుల్లాగా చూసుకోవాలి..

- శిశు గృహలో చిన్నారులకు అన్ని సౌకర్యాలు
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్



కోయ బొమ్మల విక్రయాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం: తల్లిదండ్రులు లేని లేదా వారికి దూరంగా ఉంటున్న చిన్నారులను సిబ్బంది తల్లిదండ్రుల వలె చూసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం ఆయన భద్రాచలంలో పర్యటించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న శిశుగృహను సందర్శించారు. చిన్నారులకు అందుతున్న వసతుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనాథ పిల్లలను పెంచి పోషించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, వారికి కూడా అందరూ ఉన్నారనే భావనను తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. రోడ్ల మీద తిరుగుతున్న అనాథ పిల్లలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో అనాథ శిశువులు కనపడిన సమాచారం అందితే వెంటనే శిశు గృహకు తరలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నెలల చిన్నారులను స్వయంగా ఎత్తుకున్నారు. చిన్నారులతో సరదాగా మాట్లాడి ప్రయోజకులవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం డీసీపీఓ హరికుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు గిరిజనులకు చేరాలి..

గిరిజనుల కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గిరిజనుల చెంతకు చేర్చటంలో యూనిట్ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ పీఓ చాంబర్‌లో ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌తో కలిసి యూనిట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి, శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీసీసీ ద్వారా సేకరించిన వస్తువులకు మార్కెట్ కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, డీఆర్ డిపోలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి గిరిజనులే స్వయంగా అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన పాఠశాలల్లో చదివే పిల్లలకు ఇప్పపూల సేకరణపై అవగాహన కల్పించి, వేసవి సెలవుల్లో ఇప్ప పూల మొక్కలు నాటించాలన్నారు. వన మహోత్సవం సందర్భంగా పనస చెట్లు, జీడి మామిడి చెట్లు, మునగా చెట్లు తప్పకుండా నాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు, పొలాలకు మట్టితో తయారు చేసిన సిమెంటుతో రోడ్లను వేయించాలని, పీహెచ్‌సీల్లో వైద్యులు సమయపాలన పాటించాలని, కొండరెడ్ల గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా వెదురు మొక్కలు, పామాయిల్ మొక్కలు నాటించాలని, అంతర్ పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయించాలని, అలాగే మునగ చెట్లు వేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఐటీడీఏ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కొయ్య బొమ్మల విక్రయశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి రాంబాబు, డీడీ మణెమ్మతోపాటు రవీంద్రనాథ్, నాగార్జున్‌రావు, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, వేణు, ఉదయ్‌కుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సంస్కృతి, సంప్రదాయాలకు రక్షణ



సమ్మేళనంలో మాట్లాడుతున్న గిరిజన పెద్ద తెల్లం రమణయ్య

- అంతర్ రాజ్య తెల్లం పరివార్ సంఘటన్ మిలాన్ సమార్‌లో వక్తలు
- ఐదు రాష్ట్రాల నుంచి హాజరైన 'తెల్లం' వంశీయులు



సంప్రదాయ కొమ్ము నృత్యం చేస్తున్న గిరిజనులు

చర్ల: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేలా అందరూ ఐక్యంగా ఉండాలని అంతర్ రాజ్య తెల్లం పరివార్ సంఘటన్ మిలాన్ సమార్‌లో వక్తలు సూచించారు. మండలంలోని దేవరాపల్లికి చెందిన తెల్లం కుటుంబీకుల ఆధ్వర్యాన మండలంలోని కుదునూరులో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తెల్లం ఇంటి పేరుతో ఉన్న వారు శుక్రవారం సమావేశమయ్యారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మేళనాన్ని 'అంతర్ రాజ్య తెల్లం పరివార్ సంఘటన్ మిలాన్ సమార్' పేరుతో నిర్వహిస్తుండగా దేవరాపల్లికి చెందిన తెల్లం వంశీయులు తెల్లం శంకర్‌రావు, తెల్లం లక్ష్మీనారాయణ, తెల్లం ధర్మయ్య, తెల్లం వీరస్వామి, తెల్లం నాగేశ్వరావు, తెల్లం వెంకటేశ్వరావు అధ్యక్షతన వహించారు. ఐదు రాష్ట్రాల నుంచి తెల్లం వంశీయులు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ సదస్సులో ఆయా రాష్ట్రాల్లో పాటిస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు, కొలుస్తున్న దైవాలు, జాతరలను వివరించడంతో పాటు సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల పెద్దలు మాట్లాడుతూ కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. గతంలో ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన సమ్మేళనాన్ని ఈసారి తెలంగాణలో ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఆదివాసీ గణాచారుల ధర్మ సంరక్షణ సమితి అధ్యక్షులు నాగుల శ్రీరాములు, సమ్మక్క – సారక్క ఆర్కియాలజీ రీసెర్చ్ టీం డైరెక్టర్ బుగ్గా కోటేశ్వరావుతో పాటు వివిధ సంఘాల బాధ్యులు కాకా నర్సింహారావు, బుగ్గా కోటేశ్వరావు, డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్, తెల్లం రామకృష్ణ, తెల్లం బొర్రయ్య, తెల్లం జగ్గదాదా, చుంచు రామకృష్ణ, రమణయ్య, తెల్లం లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు.

కల్లూరులో పురుషుల కబడ్డీ జట్టుకు శిక్షణ



శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

కల్లూరు: కల్లూరులోని మినీ స్టేడియంలో జిల్లాస్థాయి పురుషుల కబడ్డీ జట్టుకు శిక్షణ ఇచ్చారు. ఈ జట్టు 3వ తేదీ నుంచి ఆదిలాబాద్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈమేరకు శిక్షణలో 12 మందితో కూడిన జట్టు పాల్గొందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.దయాకర్‌రెడ్డి, క్రిస్టోఫర్ బాబు శుక్రవారం తెలిపారు. ఈకార్యక్రమంలో శిబిరం కోఆర్డినేటర్ పసుపులేటి వీరరాఘవయ్య, పీఈటీ, పీడీలు బీమా, కె.రాధాకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



అమ్మాజీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అశ్వాపురం: పార్టీ జిల్లా నాయకురాలు అమ్మాజీని స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన గణేశుల అమ్మాజీ(85) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. మృతదేహాన్ని సాబీర్‌పాషా సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అమ్మాజీ మొండికుంట, మల్లెల మడుగు ప్రాంతాల్లో భూ పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. నివాళులర్పించినవారిలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చింతిర్యాలగూడెం గ్రామానికి చెందిన సాలం హర్షవర్దన్ స్నేహితుడితో కలిసి మల్లెలమడుగులో ఫంక్షన్‌కు వచ్చాడు. తిరిగి మొండికుంట – భద్రాచలం రహదారిపై బైక్‌పై అతివేగంగా వెళ్తూ మల్లెలమడుగు శివారులో మూలమలుపు వద్ద చెట్టును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హర్షవర్దన్‌ను 108లో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం విషమంగా ఉందని సమాచారం.

రెండు మట్టి ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేటరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవా రం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం నుంచి నారంవారిగూడేనికి రెండు ట్రాక్టర్లలో మట్టి తరలిస్తుండటంతో పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

మోటమర్రిలో మిర్చితోట ధ్వంసం


బోనకల్: మండలంలోని మోటమర్రికి చెందిన రైతు వీరభద్రం ఎకరం భూమిలో సాగు చేసిన మిర్చితోటను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం ధ్వంసం చేశారు. మిరప మొక్కలను కొడవళ్లతో కోసేయగా రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీపీఐ నాయకులు యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్, ఆకెన పవన్ తోటను పరిశీలించారు.

సత్తుపల్లి రాజీవ్‌నగర్‌లో చోరీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రాజీవ్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దుండుగులు చోరీ చేశారు. కాలనీకి చెందిన పోతురాజు సుబ్రహ్మణ్యం అనారోగ్యానికి గురవడంతో చికిత్స కోసం ఇంటికి తాళం వేసి గురువారం ఖమ్మం వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దుండుగులు శుక్రవారం తెల్లవారుజామున తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఉదయం సుబ్రహ్మణ్యం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో బీరువాలో పరిశీలించగా వెండి, బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు.

కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

- ఒకరి మృతి, 20 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలింపు
- డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం



వరమ్మ (ఫైల్)



బోల్తా పడిన ట్రాక్టర్



ఘటనాస్థలం వద్ద క్షతగాత్రులు

బోనకల్: పొట్టకూటి కోసం కూలీ పనులకు బయలుదేరిన వారిని తీసుకెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వాహనం బోల్తా పడగా ఓ మహిళ మృతి చెందింది. మరో ఇరవై మందికి తీవ్ర గాయాలైన ఘటన బోనకల్ మండల కేంద్రంలోని వైరా–జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై బోనకల్ బ్రాంచ్ కెనాల్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికులు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్‌కు చెందిన 25 మంది మిరప తోట ఏరేందుకు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి ట్రాక్టర్‌లో బయలుదేరారు. గ్రామం దాటగానే బోనకల్ బ్రాంచ్ కెనాల్ సమీపాన ముందుగా వెళ్తున్న మరో ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమాన డ్రైవర్ శేషులు ఎదురుగా మరో లారీ రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కందకంలో బోల్తా పడింది. ఈ సమయాన నలుగురు కూలీలు ట్రక్కు కింద చిక్కుకుపోగా మిగతా వారు నీటి గుంతలో పడ్డారు.

హాహాకారాలు

ట్రాక్టర్ బోల్తా పడిన సమయాన పెద్దశబ్దం రావడం, ఆపై కూలీలు కేకలు వేస్తుండడంతో సమీపాన ఉన్న స్థానికులు పరుగున చేరుకున్నారు. గుంతలో పడిన వారిని బయటకు తీసేసరికే యార్లగడ్డ వరమ్మ(60) మృతి చెందింది. మరో 20 మందికి కాళ్లు, చేతులు విరగడంతో బోనకల్ పీహెచ్‌సీకి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అనంతరం మూడు 108 వాహనాలు, ట్రాలీ ఆటోల్లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఆత్మకూరి లక్ష్మీదేవి, నిమ్మగడ్డ సుబ్బమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తీసుకెళ్లారు. కాగా, గాయాలైన వారిలో లింగనబోయిన నాగమణి, మరీదు ధనలక్ష్మి, మరీదు పద్మ, మరీదు సత్యం, గాలి కృష్ణవేణి, లింగం నాగమణి, ఎస్.కే.జమిలి, మోర్ల మహాలక్ష్మి, మరీదు శైలజ, మోర్ల నారాయణమ్మ, లింగం సుశీల, పసల త్రివేణి తదితరులు ఉన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమైందని కూలీలు వెల్లడించగా, మృతురాలు, క్షతగాత్రుల బంధువులు పెద్దసంఖ్యలో ఆస్పత్రి చేరుకున్నారు.

ఘటనపై డిప్యూటీ సీఎం ఆరా

ప్రమాదం జరిగిన సమాచారం తెలియగానే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే, క్షతగాత్రులు పలువురితో మాట్లాడి ధైర్యం చెప్పారు. కాగా, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరావు పరామర్శించారు. అంతేకాక యార్లగడ్డ వరమ్మ మృతదేహం వద్ద రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



వల్లెపు వేణు (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ సంజయ్‌నగర్‌కు చెందిన 41 ఏళ్ల వయస్సు కలిగిన వల్లెపు వేణు కనిపించడం లేదని అతని తల్లి సమ్మక్క శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మతిస్థిమితం కోల్పోయిన వేణు మూడు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామశివారులో శుక్రవారం పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్ఐ శివరామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఆరుగురితోపాటు రూ.8,160, ఆరు సెల్ ఫోన్లు, నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం సమీపాన జామాయిల్‌తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తనిఖీ చేయగా ఐదుగురు పట్టుబడ్డారని, వీరి నుంచి రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

సత్తుపల్లి: సత్తుపల్లి అర్బన్ పార్క్‌కు ఫెన్సింగ్ సరిగ్గా లేకపోవడంతో అందులో నుంచి దుప్పులు రాత్రి వేళ సమీపంలోని ఇళ్లు, తోటల్లోకి వస్తున్నాయి. ఈక్రమంలోనే కొద్దిరోజుల కిందట ఓ దుప్పి బయటకు వచ్చినట్లు తెలుస్తుండగా కుక్కలు దాడి చేయడంతో మృతి చెందినట్లు తెలిసింది. ఈ నేపథ్యాన ఆంజనేయస్వామి గుడి సమీపాన మామిడి తోటలో దుప్పి కళేబరాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. కాగా, పార్క్‌కు గుడివైపు ఫెన్సింగ్ సరిగా లేదని ఇటీవల సత్తుపల్లికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు అటవీశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి ఫెన్సింగ్ వేస్తామని చెప్పి రెండు నెలలు కావొస్తున్నా పనులు చేపట్టకపోవడంతో దుప్పి మృత్యువాత పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్బన్ పార్కుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, దుప్పులను రక్షించాలని కోరుతున్నారు.